సాక్షి
శ్రీకాకుళం

శనివారం ¦ 4 ¦ మార్చి ¦ 2023



ఆరోగ్య మస్తు

జిల్లాలో అర్బన్ హెల్త్ సెంటర్లు ఏర్పాటవుతున్నాయి. మూడు చోట్ల సేవలు ప్రారంభమయ్యాయి. -IIలో



వేర్వేరు ఘటనల్లో..

జిల్లాలో వేర్వేరు ఘటనల్లో ముగ్గురు మృతి చెందారు. ఆయా గ్రామాల్లో విషాద ఛాయలు అలముకున్నాయి. -IIలో

రెండో విడత ప్రాక్టికల్స్ మొదలు

శ్రీకాకుళం న్యూకాలనీ: ఇంటర్మీడియెట్ ప్రాక్టికల్ పరీక్షలు (రెండో విడత) శుక్రవారం మొదలయ్యాయి. జిల్లాలో 76 కేంద్రాల్లో 6254 మంది విద్యార్థులు ప్రాక్టికల్ పరీక్షలకు హాజరు కావా ల్సి ఉండగా 6079 మంది హాజర య్యారు. వివిధ కారణాలతో 175 మంది గైర్హాజ రయ్యారు. అధికారులు ముమ్మరంగా తనిఖీలు నిర్వహించారు.

న్యూస్‌రీల్

ఘనంగా ఆదిత్యుని కల్యాణం



ఆదిత్యుని కల్యాణాన్ని నిర్వహిస్తున్న దృశ్యం

అరసవల్లి: అరసవల్లి శ్రీసూర్యనారాయణ స్వామి సన్నిధిలో శుక్రవారం ఉదయం ఫల్గుణ శుద్ధ ఏకాదశి సందర్భంగా స్వామి కల్యాణం ఘనంగా నిర్వహించారు. ఉషా పద్మిని ఛాయా దేవేరులతో శ్రీవారి ఉత్సవమూర్తులను కల్యాణ మూర్తులుగా అలంకరించి అనివెట్టి మండపంలో వెండి సింహవాహనంలో వేంచేసింపజేశారు. ఆలయ ప్రధానార్చకులు ఇప్పిలి శంకర శర్మ ఆధ్వర్యంలో జరిగిన ఈ కల్యాణాన్ని స్మార్త ఆగమ శాస్త్ర ప్రకారం అర్చకులు ఇప్పిలి సాందీప్ శర్మ నిర్వహించారు. ఈ సేవ కోసం రూ.500 చెల్లించిన భక్తుల గోత్రనామాలతో ప్రత్యేక పూజలు చేశారు.

ఆడపిల్ల రక్షణ అందరి బాధ్యత



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌ఓ మీనాక్షి

అరసవల్లి: 'ఆడపిల్లలను రక్షించు...ఆడపిల్లలను చదివించు..' అనే నినాదం మారుమోగింది. ఈ మేరకు శుక్రవారం జిల్లా వైద్యారోగ్య శాఖ కార్యాలయం నుంచి ఏడు రోడ్ల కూడలి వరకు అధికార బృందాలు ర్యాలీగా తరలివెళ్లాయి. డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి.మీనాక్షి ఆధ్వర్యంలో ప్రారంభించిన ఈ ర్యాలీలో భాగంగా ఆడపిల్లల భవిష్యత్ కోసం నినాదాలు చేశారు. అనంతరం స్కానింగ్ సెంటర్లను వైద్యాధికారులు సందర్శించారు. కార్యక్రమంలో డీఐఓ ఆర్‌వీఎస్ కుమార్, వైద్యాధికారులు కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్దానంలో ఎలుగు సంచారం



ఎలుగును వెంబడిస్తున్న వీధి కుక్కలు

వజ్రపుకొత్తూరు రూరల్: మండలం డోకులపాడు పరిసర జీడి తోటల్లో శుక్రవారం ఎలుగు సంచరించింది. అయితే పరిసర తోటల్లో సంచరిస్తున్న వీధి కుక్కలు ఎలుగును వెంబడించడంతో ఎలుగు పరుగులు తీసింది. జీడి పంట ప్రస్తుతం పూత దశలో ఉండటంతో రైతులు జీడి తోటలకు పనుల కోసం వెళ్తున్నారు. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని రైతులు భయాందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి ఎలుగులను నియంత్రించే చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

వందన వికాస కేంద్రాల ద్వారా ఆదాయం

మెళియాపుట్టి: గిరిజనులు వందన వికాస కేంద్రాల (వీడీవీకే)ద్వారా ఆదాయం పెంపొందించుకోవాలని సీతంపేట ఐటీడీఏ పీఓ బండి నవ్య అన్నారు. ఆమె శుక్రవారం స్థానిక ఐకేపీ కార్యాలయంలో వీడీవీకే ప్రాసెసింగ్ యూనిట్‌ను పరిశీలించారు. జీడి పిక్కలు, చింతపండు, పసుపు కొనుగోలు చేసి, ప్రాసెసింగ్ చేయాలని అన్నారు. లీడర్లు, సభ్యులు సక్రమంగా పనితీరు కనబరచాలని అన్నారు. వందన వికాస కేంద్రాల సభ్యుల నుంచి వెయ్యిరూపాయల వాటాధనం కట్టించాలని తెలిపారు. కేంద్రాల్లో ఉన్న సభ్యుల తోటల్లోని జీడి ఇతరత్రా పంటలు వందన వికాస కేంద్రాలకు అమ్మేలా వారికి అవగాహన కల్పించాలని ఏపీఎం లలితతో అన్నారు. కేంద్రాల సభ్యులందరికీ శిక్షణ ఇవ్వాలన్నారు. అనంతరం చాపర గ్రామ సచివాలయాన్ని సందర్శించి పలు దస్త్రాలను పరిశీలించారు.

తాగునీటి కోసం మానిటరింగ్ సెల్

హిరమండలం: జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సమస్యలు తెలుసుకుని పరిష్కరించేందుకు మానిటరింగ్ సెల్ ఏర్పాటు చేసినట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ టి.శ్రీనివాస్ ప్రసాద్ తెలిపారు. హిరమండలం వంశధార రిజర్వాయర్‌కు అనుసంధానం జరుగుతున్న ఉద్దానం తాగునీటి ప్రాజెక్టుకు సంబంధించిన పంపు హౌస్ పనులను ఆయన శుక్రవారం పరిశీలించారు. రూ.750 కోట్లతో చేపడుతున్న ఈ పనులు 90 శాతం పూర్తయ్యాయని తెలిపారు. ఉద్దానం వరకు పైప్‌లైన్ పనులు పూర్తయ్యాయని తెలిపారు. వేసవిలో ఎక్కడైనా తాగునీటి ఇబ్బందులు ఉంటే 9100120604 నంబర్‌కు ఫోన్ చేసి చెప్పాలని సూచించారు.

కాసుల చెట్టెక్కిస్తున్న మునగ



మునగ కట్టలు

- ఉద్దానంలో విరగ్గాసిన మునగ పంట
- ఉత్తరాది రాష్ట్రాలకు ఎగుమతులు ప్రారంభం
- ఉద్దాన దేశీ మునగకు భలే డిమాండ్

కాశీబుగ్గ: ఉద్దానం మునగ ఉత్తరాదికి వెళ్తోంది. రుచిలో ఈ మునగకు సాటే లేదు. ఈ దేశీ మునగకు స్థానికంగా కూడా చాలా మంది అభిమానులు ఉన్నారు. ఈ రుచే ఉత్తరాది వారిని కూడా ఆకట్టుకుంది. జిల్లాలోని పలాస, ఇచ్ఛాపురం నియోజకవర్గాల్లో ఉన్న ఏడు మండలాల్లోని ఉద్దానంలో పండే మునగ రుచే వేరు. మెట్ట, పల్లపు ప్రాంతాల్లో మునగ చెట్లు ఉన్నా రుచి, కమ్మదనంలో ఉద్దాన మునగదే ప్రథమ స్థానం. అందుకే ఈ మునగను ఉత్తరాది రాష్ట్రాల వారు మెచ్చుకుంటున్నారు. ఒకటి కాదు రెండు కాదు ఏకంగా ట్రిప్పుకు రెండు టన్నుల మునగ కాయలు ఎగుమతి అవుతున్నాయంటే అతిశయోక్తి కాదు.

పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీలో ఉన్న కాశీబుగ్గ పాతజాతీయ రహదారి, ఇచ్ఛాపురం, హరిపురంలో ఎగుమతులు జరిగే పాయింట్‌లు ఉన్నాయి. ఉద్దాన ప్రాంతంలో ఉన్న వజ్రపుకొత్తూరు, మందస, పలాస, కంచిలి, సోంపేట, కవిటి, ఇచ్ఛాపురం మండలాల్లో 20వేల హెక్టార్లలో ఉన్న జీడిమామిడి, కొబ్బరి, కాయగూరల తోటలలో అంతరపంటగా పండిస్తున్నారు. లోకల్ మార్కెట్ చూస్తే పూండి, వజ్రపుకొత్తూరు, కొర్రాయిగేటు, హరిపురం, మందస, బారువ, సోంపేట, కంచిలి, కవిటి,



ఉత్తరాది ఎగుమతులకు సిద్ధమైన మునగమూటలు

ఇచ్ఛాపురం, బ్రాహ్మణతర్లా జాతీయ రహదారుల్లో వీటి విక్రయాలు జోరుగా సాగుతున్నాయి.

కిలో రూ.50

మునగ ఏడాదికి మూడు సార్లు దిగుబడి ఇస్తుంది. కొన్ని మునగ చెట్లు మాత్రం ఒక్కసారి మాత్రమే కాస్తున్నాయి. హైబ్రిడ్ కాయలు ఎప్పుడు కావాలన్నా కాస్తున్నప్పటికీ రుచి అంతగా ఉండకపోవడంతో అధిక శాతం మంది దేశీ మునగనే కోరుకుంటున్నారు. కాయలు తుంచిన నాలుగు ఐదు రోజుల వరకు వాటిని వినియోగించవచ్చును. సరిపడా శీతలం అందిస్తే వారం రోజులు వరకు నిల్వ ఉంటాయి. వీటి సేకరణ ఒక్కపూటలో జరుగగా ఇతర రాష్ట్రాలకు తరలించేందుకు రెండు రోజులు పడుతుంది. పరిసర ప్రాంతాల నుంచి సేకరించిన మునగ కాయలు లారీ లోడు నిండగానే అవి బయలుదేరుతాయి. సీజన్ ప్రారంభంలో కిలో రూ.100 పలికిన మునగకాయలు ప్రస్తుతం కేజీ రూ.50 రూపాయలు పలుకుతున్నాయి. ఉత్తరాది రాష్ట్రాలైన పశ్చిమబెంగాల్, బీహార్, మధ్యప్రదేశ్, ఉత్తర ప్రదేశ్, ఒడిశా రాష్ట్రాల్లో మునగ కాయలను కూరలకు, పచ్చడికి, మునగ ఆకులను పులుసు, సాంబారు, వేపుడుకు వాడుతారు. ఉత్తరాది పచ్చళ్లలో మునగ కాయల పచ్చడి ప్రత్యేకమైన వంటకం. ఇది ఏడాది పాటు నిల్వ ఉంచుకుని భోజనాలలో తింటారు.



సంతోషకరం



ఉద్దానంలో పండించే పంటలు రుచికి పెట్టింది పేరు. పెరటి పంటగా పండించుకునే మునగ పంట ప్రస్తుతం వాణిజ్య పంటగా మారుతుండటం సంతోషంగా ఉంది. మేము తోటలలో సేకరించిన మునగ పంటను పరిసర ప్రాంతాల్లో అమ్మేస్తాం. అధికంగా దిగుబడి వచ్చినా కాయలు అందరూ ఒకేసారి కోసి ఎగుమతులు చేసుకోవడం కోసం పలాస తరలిస్తాం. పంట దిగుబడి తక్కువగా ఉన్నప్పుడు ఎక్కువ రేటు పలుకుతుంది. పంట అధికంగా పండితే వాటి రేటు తగ్గిపోతుంది.

– గుజ్జు లక్ష్మి, మహిళా రైతు, బొడ్డపాడు, పలాస మండలం

ఉద్దాన వాతావరణంలో..




ఉద్దాన వాతావరణం మునగ పంట దిగుబడికి మేలు చేస్తుంది. హైబ్రీడ్‌తో పోల్చితే ఈ దేశీ మునగ చాలా బెటర్. ప్రమాదాలు జరిగినా, ఎలాంటి ఆపరేషన్‌లు జరిగినా మునగ ఆకును వేపుకుని తింటారు. వారానికి రెండు సార్లు ఉద్దాన వాసులు మునగ ఆకులు, మునగ కాయలు తినడం పరిపాటి. ఉద్దాన ప్రాంతంలో ఉన్న మునగ కాయలకు ఇంత డిమాండ్ రావడం ఉద్దాన రైతుగా సంతోషం వ్యక్తం చేస్తున్నాం. నేను ఆర్మీలో రిటైరయ్యాను. మాకున్న తోటలో మునగ చెట్లు పెంచుతున్నాము. ఏడాదికి మూడు సార్లు కాపు కాస్తున్నాయి.

– కుత్తుం వినోద్‌కుమార్, విశ్రాంత ఆర్మీ అధికారి, మునగ రైతు, మాకన్నపల్లి గ్రామం, పలాస మండలం

సాగు విస్తీర్ణం	పంట ప్రారంభంలో ధర	ఎగుమతి ఎక్కడికి	వినియోగం	ప్రత్యేకతలు
20,000 ఎకరాలు (ఉద్దానంలో)	కిలో 100	పశ్చిమబెంగాల్, బీహార్, మధ్యప్రదేశ్, ఉత్తర ప్రదేశ్, ఒడిశా	పచ్చడి, పులుసు, వేపుడు, సాంబారు తయారీకి..	మునగ పచ్చడి ఏడాది పాటు నిల్వ ఉంటుంది

మంచు ముత్యాల ఇల్లు.. సాలీడుకే చెల్లు



మంచు ముత్యాలు పొదిగిన సాలె గూడు ఇది. కష్టపడి ఇంటిని కట్టుకున్న స్పైడీ.. నా కంటే గొప్పవాడేడీ అన్నట్టు ఫొటోకిలా ఫోజిచ్చింది. శ్రీకాకుళం పరిసర ప్రాంతంలో ఓ వేకువన ఈ దృశ్యం ఆవిష్కృతమైంది. – సాక్షి ఫొటోగ్రాఫర్, శ్రీకాకుళం

'నేర నియంత్రణలో మహిళా పోలీసులే కీలకం'

శ్రీకాకుళం క్రైమ్ : మహిళలపై జరిగే నేరాల నియంత్రణలో మహిళా పోలీసులు కీలక పాత్ర పోషించాలని ఎస్పీ జీఆర్ రాధిక సూచించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో శుక్రవారం ఆమె మహిళా పోలీసులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. క్షేత్రస్థాయిలో ప్రజల సమస్యలను మానవీయ కోణంలో అర్థం చేసుకుని పరిష్కరించాలని, గ్రామాల్లో సందర్శించి తరచూ గొడవలు పడే వారిని గుర్తించి వారిలో చైతన్యం కలిగించాలని సూచించారు. కళాశాలలు, పాఠశాలలు, ముఖ్యమైన కూడళ్లు, బస్సులు, ఆటోల్లో మహిళలు, విద్యార్థినులను ప్రేమ పేరిట వేధించే ఆకతాయిల సమాచారాన్ని పోలీస్ స్టేషన్‌కు తెలియజేయాలన్నారు. దిశ యాప్ గ్రామ, పట్టణాల్లో ఉన్న మహిళలకు తెలియపరిచి క్షేత్రస్థాయిలో సైబర్ నేరాలు, అసాంఘిక కార్యకలాపాల వల్ల కలిగే దుష్ప్రభావాలు వివరించాలన్నారు. ఎన్నికల నియమావళి అందరూ పాటించేలా చూడాలన్నారు. వీసీలో అదనపు ఎస్పీ టీపీ విఠలేశ్వరరావు, డీఎస్పీ జి.శ్రీనివాసరావు, ఆయా పోలీస్ కార్యాలయాలు, స్టేషన్ల నుంచి సంబంధిత డీఎస్పీలు, సీఐలు, ఎస్‌ఐలు, మహిళా పోలీసులు పాల్గొన్నారు.



మహిళా పోలీసులతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న ఎస్పీ జీఆర్ రాధిక

అంబేడ్కర్ గురుకులాల్లో ఐదో తరగతిలో ప్రవేశాలు

శ్రీకాకుళం పాతబస్టాండ్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల విద్యాలయాల్లో 5వ తరగతి, ఇంటర్మీడియెట్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆ సంస్థల జిల్లా కో ఆర్డినేటర్ జి.గ్రేసీ ఓ ప్రకటనలో తెలిపారు. అర్హత, ఆసక్తి ఉన్న వారు ఈ నెల 24 లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు చేసుకున్న వారికి ఏప్రిల్ 23న పరీక్ష ఉంటుందని తెలిపారు. 5వ తరగతికి ఉదయం 10 నుంచి 12 గంటల వరకు, ఇంటర్మీడియెట్ వారికి మధ్యాహ్నం 2 గంటల నుంచి 4.30 గంటల వరకు పరీక్ష ఉంటుందని తెలిపారు. ఇతర వివరాలకు జిల్లా కోఆర్డినేటర్ కార్యాలయం, సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయులను సంప్రదించాలని సూచించారు. రిజర్వేషన్ ప్రాప్తికి ప్రవేశాలు ఉంటాయని తెలిపారు.

ప్రశాంతంగా పరీక్షలు రాయండి: డీఈఓ



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈఓ పగడాలమ్మ

రణస్థలం: పదో తరగతి విద్యార్థులు చక్కగా చదువుకుని పదికి పది పాయింట్లు సాధించాలని డీఈఓ జి.పగడాలమ్మ సూచించారు. మండలంలోని ఆదర్శ పాఠశాల, ఎంఈఓ కార్యాలయాన్ని ఆమె శుక్రవారం సందర్శించారు. విద్యార్థులు ప్రశాంతంగా పరీక్షలు రాయాలన్నారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓ ఎ.త్రినాథరావు, ఆదర్శపాఠశాల ప్రిన్సిపాల్ పి.శ్రీధర్, హెచ్‌ఎంలు జగన్నాథరావు, రాజాకిషోర్ తదితరులు ఉన్నారు.

జిల్లాలో 80 చెరువుల అభివృద్ధి

ఆమదాలవలస: అమృత్ సరోవర్ కింద నిర్వహిస్తున్న చెరువుల పనులు వేగవంతం చేయాలని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ ఆదేశించారు. ఆమదాలవలస మండలంలోని చిట్టివలస గ్రామంలో గల జగ్గన్న కోనేరులో చేస్తున్న ఉపాధి పనులను ఆయన శుక్రవారం పరిశీలించారు. ఉపాధి వేతనదారులతో మాట్లాడి వేతనాల వివరాలు, పని దినాలు, సదుపాయాల గురించి ఆరా తీశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆజాదీ కాఅమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా అమృత్ సరోవర్ పథకం కింద జిల్లాలో 80 చెరువులను సుందరంగా తీర్చిదిద్దేందుకు నిధులు మంజూరు చేశారని అన్నారు. అందులో భాగంగా ఇప్పటికే 20 చెరువుల పనులు పూర్తయ్యాయని, మిగతా 60 చెరువుల్లో పనులు జరుగుతున్నాయని చెప్పారు. ఉపాధి హామీ పథకం ద్వారా నిర్వహించే ఈ పనుల్లో జాబ్‌కార్డు ఉన్నవారంతా ఉత్సాహంగా పాల్గొనాలన్నారు. ఆగస్టు నెలాఖరు కల్లా పనులు పూర్తి చేసి చెరువులను ఆహ్లాదకరంగా తీర్చిదిద్దాలని సూచించారు. చెరువుల్లో, ఊరి బయట చెత్త వేసే వారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.



చిట్టివలసలోని జగ్గన్న కోనేరులో జరుగుతున్న ఉపాధి హామీ పనులు పరిశీలిస్తున్న కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్

పరీక్షల వేళ..



- 15 నుంచి ఇంటర్మీడియెట్ పరీక్షలు
- జిల్లా వ్యాప్తంగా 109 కేంద్రాల కేటాయింపు
- పరీక్ష రాయనున్న 57,122 మంది విద్యార్థులు
- నిమిషం ఆలస్యమైనా నో ఎంట్రీ
- సమస్యలు, సందేహాల నివృత్తికి హెల్ప్‌డెస్క్ ఏర్పాటు

శ్రీకాకుళం న్యూకాలనీ: ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షలకు జిల్లాలో ఏర్పాట్లు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఈ నెల 15 నుంచి పరీక్షలు నిర్వహించనున్నారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్దేశిత షెడ్యూల్ ప్రకారం పరీక్షలు జరుగుతాయి. నిమిషం ఆలస్యమైనా అనుమతించబోమని అధికారులు స్పష్టం చేస్తున్నారు. పరీక్ష కేంద్రాలకు అరగంట ముందుగా చేరుకునేలా ఏర్పాట్లు చేసుకోవాలని సూచిస్తున్నారు. జిల్లా డీవీఈఓ కోట ప్రకాశరావు సమన్వయంతో ఆర్ఐఓ ఎస్.తవిటినాయుడు నేతృత్వంలో డీఈసీ కమిటీ ఏర్పాట్లలో నిమగ్నమైంది. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పరీక్షలు సాఫీగా రాసేలా చర్యలు తీసుకుంటున్నారు.

109 కేంద్రాలు.. 57122 మంది విద్యార్థులు

ఇంటర్మీడియెట్ పరీక్షలకు ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలో గత ఏడాది 98 కేంద్రాలను కేటాయించగా.. ఈ ఏడాది రికార్డుస్థాయిలో 109 కేంద్రాలను కేటాయించారు. ఇందులో ప్రభుత్వ జూనియర్ కళాశాలలు 42, మోడల్ స్కూల్/కాలేజీలు 3, సోషల్ వెల్ఫేర్ 7, ట్రైబల్ వెల్ఫేర్ 2, ప్రైవేటు జూనియర్ కళాశాలలు 55 ఉన్నాయి. ఈ ఏడాది జిల్లా వ్యాప్తంగా 57,122 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. ఇందులో ప్రథమ సంవత్సరం 29,589 మంది, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 27,533 మంది ఉన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ తో పాటు పోలీసు బందోబస్తు కల్పించనున్నారు. పూర్తి స్థాయిలో ఫర్నీచర్ ఉండేలా పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నారు. అలాగే నిరంతర విద్యుత్, ఫ్యాన్లు, లైటింగ్ ఏర్పాటు, తాగునీరు కల్పన, మరుగుదొడ్ల పరిశుభ్రతకు చర్యలు తీసుకుంటున్నారు.

పరీక్ష కేంద్రాలపై ప్రత్యేక ఫోకస్..

పరీక్ష కేంద్రాలపై అధికారులు ప్రత్యేకంగా ఫోకస్ చేస్తున్నారు. పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాల నిఘాతోపాటు వాటిని ఇంటర్‌బోర్డు, జిల్లా ఆర్ఐఓ కార్యాలయానికి స్ట్రీమింగ్ ద్వారా అనుసంధానం చేశారు. నిరంతరం పర్యవేక్షించవచ్చు. పరీక్ష నిర్వహణకు కలెక్టర్ అధ్యక్షతన ఒక హై పవర్ కమిటీ సభ్యులు, 109 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 109 మంది డిపార్ట్‌మెంట్ అధికారులు, కస్టోడియన్లను నియమించారు. సిట్టింగ్ స్క్వాడ్‌లు 5, ఫ్లయింగ్ స్క్వాడ్‌లు 5, జిల్లా వ్యాప్తంగా సమస్యాత్మక కేంద్రాలగా గుర్తించిన 17 కళాశాలల్లో ప్రత్యేక సిట్టింగ్ స్క్వాడ్‌లను నియమిస్తున్నారు.



పరీక్షలకు ఏర్పాట్లపై ఆర్ఐఓ నేతృత్వంలో సమీక్షిస్తున్న డీఈసీ కమిటీ

పకడ్బందీగా ఏర్పాట్లు



జిల్లాలో ఇంటర్ పరీక్షలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నాం. కమిషనర్ ఆదేశాల మేరకు విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పరీక్షలు రాసేలా చర్యలు తీసుకుంటున్నాం. 109 కేంద్రాల్లో పరీక్షలు జరుగుతాయి. పరీక్ష కేంద్రాలకు మెటీరియల్స్‌ను త్వరలో చేరవేస్తాం. హాల్‌టిక్కెట్ల పంపిణీ ప్రక్రియను త్వరలో చేపడతాం.

– శాసనం తవిటినాయుడు, ఇంటర్మీడియెట్ బోర్డు, జిల్లా ఆర్ఐఓ, డీఈసీ కన్వీనర్

హెల్ప్‌లైన్ ఏర్పాటు..

విద్యార్థుల సౌకర్యార్థం ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా ఆర్ఐఓ కార్యాలయంలో హెల్ప్ లైన్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. విద్యార్థులు తమ సమస్యలు, సందేహాల నివృత్తి కోసం ఓ అధికారి, సిబ్బందిని కంట్రోల్ రూమ్‌లో నియమించారు. ల్యాండ్‌లైన్ నంబర్ 08942 295933, సెల్ నంబర్ 8639313490 ను సంప్రదించవచ్చని జిల్లా ఆర్ఐఓ ఎస్.తవిటి నాయుడు సూచిస్తున్నారు.

మౌలిక సదుపాయాలు తప్పనిసరి..



పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాలను అమర్చాం. ఇంటర్ బోర్డు కార్యాలయంలో నిరంతరం పర్యవేక్షిస్తాం. అధికారులు, తనిఖీ బృందాలు, సిబ్బంది నియామకం దాదాపుగా పూర్తయ్యింది. వేసవిని దృష్టిలో పెట్టుకుని పరీక్ష కేంద్రాల వద్ద తాగునీరు, ఫ్యాన్లు, ఫర్నీచర్, మరుగుదొడ్ల పరిశుభ్రత వంటి మౌలిక సదుపాయాలు తప్పనిసరి చేశాం. కలెక్టర్ ఆదేశాల మేరకు అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నాం. ప్రిన్సిపాళ్లు, లెక్చరర్లంతా సహకరించి పరీక్షలను విజయవంతం చేయాలి.

– కోట ప్రకాశరావు, ఇంటర్మీడియెట్ విద్య జిల్లా డీవీఈఓ

వన్య ప్రాణులను రక్షించుకుందాం



మానవ మనుగడకు ఆధారమైన అడవులు, వన్య ప్రాణులను సంరక్షించుకోవడం మనందరి కర్తవ్యమని ప్రధానోపాధ్యాయులు శేషగిరిరావు, కె.సుహాస్‌చంద్‌లు అన్నారు. వన్యప్రాణుల దినోత్సవం సందర్భంగా శుక్రవారం కొళిగాం ఉన్నత పాఠశాల, ముచ్చింద్ర ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులతో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ముచ్చింద్ర పాఠశాల విద్యార్థులు వన్యజీవుల మాస్క్‌లతో పాఠశాల తోటల్లో ప్రదర్శించిన లఘు నాటిక ఆకట్టుకుంది.

– ఇచ్ఛాపురం రూరల్

క్లుప్తంగా

లక్ష్యంతో ముందుకుసాగాలి

ఎచ్చెర్ల క్యాంపస్: విద్యార్థులు లక్ష్యంతో ముందుకు సాగాలని విశాఖపట్నంకు చెందిన ఆంధ్రా విశ్వవిద్యాలయం మెకానికల్ ఇంజినీరింగ్ ప్రొఫెసర్ రామయ్య అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలోని ఇంజినీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో నాలుగు రోజుల పాటు నిర్వహిస్తున్న ప్రేరణ తరగతుల్లో భాగంగా శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఇంజినీరింగ్‌లో సబ్జెక్టు కంటే సాంకేతిక పరిజ్ఞానం కీలకమని చెప్పారు. ప్రతి విద్యార్థి నిరంతరం సాంకేతిక అంశాలు తెలుసుకోవాలని, పారిశ్రామిక రంగంలో వస్తున్న మార్పులు గమనించాలని సూచించారు. కమ్యూనికేషన్ స్కిల్స్, టెక్నికల్ స్కిల్స్ పెంపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో విద్యావిభాగం అధ్యాపకులు డాక్టర్ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

చిన్నపిల్లమ్మ మృతికి సంతాపం



కుటుంబాన్ని పరామర్శిస్తున్న ప్రజాసంఘాల నాయకులు

పలాస: మండలంలోని బొడ్డపాడుకు చెందిన మాజీ నక్సలైట్ గేదెల చిన్నపిల్లమ్మ(90) అనారోగ్యంతో మృతి చెందారు. ఆమె మృతి పట్ల వివిధ ప్రజాసంఘాల నాయకులు శుక్రవారం సంతాపం తెలిపారు. చిన్నపిల్లమ్మ నాటి శ్రీకాకుళం గిరిజన రైతాంగ పోరాటంలో పాల్గొనడంతో ఆమెతో పాటు 70మందిని పోలీసులు అరెస్టు చేసి రాజమండ్రి సెంట్రల్ జైలులో నిర్బంధించారు. ఏడాది వయస్సున్న ఆమె కుమారుడు గేదెల జానకిరావు కూడా అప్పట్లో జైలుకు వెళ్లాడు. ఆ తర్వాత భర్త కూడా జైలుకు వెళ్లాడు. ఆమె కుమారుడు జానకిరావు సి.పి.ఐ.ఎం.ఎల్.లిబరేషన్ పార్టీలో పనిచేస్తున్నారు. చిన్నపిల్లమ్మ మృతి పట్ల ప్రజాసంఘాల నాయకులు బి.ఓంకార్, తామాడ సన్యాసిరావు, బొడ్డు వాసుదేవరావు, బి.ఆనందరావు తదితరులు సంతాపం తెలియజేశారు.

న్యాయవాదులను కలిసిన 'దుప్పల'



న్యాయవాదులకు కరపత్రాలు అందిస్తున్న దుప్పల రవీంద్రబాబు

శ్రీకాకుళం పాతబస్టాండ్: పట్టభద్రుల శాసన మండలి ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్న దుప్పల రవీంద్రబాబు శుక్రవారం శ్రీకాకుళం బార్ అసోసియేషన్‌లో న్యాయవాదులను కలిశారు. మొదటి ప్రాధాన్యతా ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బార్ మాజీ అధ్యక్షుడు శిష్టు రమేష్, న్యాయవాదులు కంచరాన నాగభూషణరావు తదితరులు పాల్గొన్నారు.

పరిశ్రమలతోనే ఉత్తరాంధ్ర అభివృద్ధి



మాట్లాడుతున్న బీసీ న్యాయవాదులు సంఘం ప్రతినిధులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఉత్తరాంధ్ర అభివృద్ధికి, ఇక్కడి ప్రజల ఉపాధి, జీవన ప్రమాణాల పెరుగుదలకు విశాఖపట్నంలో నిర్వహిస్తున్న ప్రపంచస్థాయి పారిశ్రామికవేత్తల సదస్సు ఎంతగానో ఉపయోగపడుతుందని బీసీ న్యాయవాదుల సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఆగూరు ఉమామహేశ్వరరావు, చౌదరి లక్ష్మణరావు అన్నారు. జిల్లా కోర్టు ఆవరణలో శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడుతూ ఉత్తరాంధ్ర జిల్లాల్లో మరిన్ని పరిశ్రమలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఉత్తరాంధ్ర అభివృద్ధి చెందాలన్నా, యువతకు ఉపాధి లభించాలన్నా పరిశ్రమలు ఏర్పాటు చేయాలన్నారు.

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24కి. 10గ్రా.)	56,150-00
బంగారం(22కి. 10గ్రా.)	51,800-00
వెండి (కిలో)	71,200-00

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)	
విశాఖపట్నం	రూ. 420.00
విజయనగరం	రూ. 424.00
శ్రీకాకుళం	రూ. 424.00

చికెన్

బ్రాయిలర్		
లైవ్	డ్రెస్‌డ్	స్కిన్‌లెస్
₹95	₹160	₹ 170

ఆరోగ్యమస్తు..!



ఆమదాలవలస మున్సిపాలిటీలో నిర్మించిన అర్బన్ హెల్త్ సెంటర్

- పట్టణవాసుల కోసం పది అర్బన్ హెల్త్ సెంటర్లు
- ఇప్పటికే మూడు చోట్ల సేవలు ప్రారంభం
- మిగిలిన చోట్ల శరవేగంగా భవనాల నిర్మాణాలు
- ఉచితంగా వైద్య పరీక్షలు, టెలీ మెడిసిన్ సేవలు



రామకృష్ణాపురంలో ప్రారంభానికి సిద్ధంగా యూహెచ్‌సీ

కాశీబుగ్గ: పట్టణవాసులకు కార్పొరేట్ ఆస్పత్రులకు దీటుగా వైద్యసేవలందించేందుకు అర్బన్ హెల్త్ సెంటర్లు(యూహెచ్‌సీ) సిద్ధమవుతున్నాయి. పెరుగుతున్న పట్టణ ప్రజల జనాభాను అనుగుణంగా విస్తరిస్తున్న వ్యాధుల నుంచి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా ముందుకు వచ్చాయి. ప్రాంతాలను యూనిట్‌గా తీసుకుని అర్బన్ హెల్త్ సెంటర్‌లను నిర్మిస్తున్నాయి. గత ప్రభుత్వ హయాంలో ముఖ్యమంత్రి పట్టణ ఆరోగ్య కేంద్రం పేరుతో అరకొరగా సేవలందించేవారు. ప్రస్తుతం పట్టణాలలో జనాభా రెట్టింపు కావడంతో కేంద్రాల సంఖ్య రెట్టింపు చేశారు.

అనేక సేవలు..

అర్బన్ హెల్త్ సెంటర్లు పూర్తి డిజిటలైజేషన్‌తో కూడుకున్నవి. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలతో పోల్చితే అదనపు సౌకర్యాలు అందుబాటులో ఉంటాయి. వైద్యులు, ఫార్మసిస్టు, ల్యాబ్ టెక్నీషియన్, నర్సులు, ఎఫ్ఎన్ఓ, ఎంఎన్ఓలు సేవలు అందిస్తారు. వీరేకాకుండా టెలీ మెడిసిన్ పద్ధతులలో సంబంధిత స్పెషలిస్టు ఆరోగ్య సమస్యలు విని ఆన్‌లైన్‌లో సలహాలు, సూచనలు అందిస్తారు. ఉచిత వైద్య పరీక్షలతో పాటు మందులు అందిస్తారు. చిన్నారులకు పూర్తిస్థాయిలో వ్యాక్సిన్లు అందజేస్తారు.

> **పట్టణ ప్రజలు వినియోగించుకోవాలి..**
>
> 
>
> శ్రీకాకుళం నగరపాలక సంస్థ, పలాస-కాశీబుగ్గ, ఆమదాలవలస, ఇచ్ఛాపురం మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలకు యూహెచ్‌సీలు వరంలాంటివి. ఇప్పటికే శ్రీకాకుళం, ఆమదాలవలసలో సేవలు ప్రారంభమయ్యాయి. మిగిలినవి కూడా త్వరలోనే సేవలు అందిస్తాయి. ఉచిత వైద్య పరీక్షలు, మందులు, ఆన్‌లైన్ వైద్యసేవలు అందుబాటులోకి వస్తాయి. – సుగుణాకర్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్, పబ్లిక్ హెల్త్, శ్రీకాకుళం

జిల్లాలో పది యూహెచ్‌సీలు..

- శ్రీకాకుళం నగర పాలక సంస్థలో మూడు అర్బన్ హెల్త్‌సెంటర్‌లు నిర్మాణాలు పూర్తి చేసుకున్నాయి. అందులో రెండు కేంద్రాలు ఇప్పటికే ప్రారంభమై సేవలు అందిస్తున్నారు. ఆదివారంపేట, పుణ్యపువీధి కాలనీ, దమ్మలవీధిలో యూహెచ్‌సీలు అందుబాటులో ఉన్నాయి.
- పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీలో మూడు అర్బన్ హెల్త్‌సెంటర్లు మంజూరుకాగా అందులో ఒకటి స్థలవివాదంతో నిలిచిపోయింది. మిగిలిన రెండు పనులు పూర్తయి ప్రారంభానికి సిద్ధమయ్యాయి. మొగిలిపాడు, రామకృష్ణాపురం పనులు పూర్తికాగా, సూదికొండలో పునాదిస్థాయిలో నిలిచిపోయింది.
- ఆమదాలవలస మున్సిపాలిటీ మోనింగివారి వీధిలో యూహెచ్‌సీ ప్రారంభం కాగా, మెట్టక్కివలసలో భవనం ప్రారంభానికి సిద్ధమైంది.
- ఇచ్ఛాపురం మున్సిపాలిటీలోని బెల్లుపడ కాలనీ-02, పురుషోత్తపురంలో త్వరలోనే పనులు పూర్తికానున్నాయి.

సహారా ఖాతాదారుల ఆందోళన



అధికారులను నిలదీస్తున్న ఖాతాదారులు

పాతపట్నం: పాతపట్నం ప్రభుత్వ ఆస్పత్రి కూడలి వద్ద ఉన్న సహారా ఇండియా కార్యాలయంలో పాలసీదారులు, ఏజెంట్లు శుక్రవారం ఆందోళనకు దిగారు. పదేళ్లగా ఖాతాదారులకు ఆర్థికపరమైన చెల్లింపులు జరగడం లేదని అధికారులను నిలదీశారు. శ్రీకాకుళం నుంచి రీజనల్ మేనేజర్ బి.లక్ష్మణరావు పాతపట్నం కార్యాలయానికి వచ్చారన్న సమాచారం తెలుసుకున్న ఖాతాదారులు పెద్ద ఎత్తున తరలివచ్చి నిరసన చేపట్టారు. గడువు ముగిసిన పాలసీదారులకు వెంటనే చెల్లింపులు చేయాలని డిమాండ్ చేశారు. ఖాతాదారులకు న్యాయం చేయాలని కోరారు.

రేపు ఉద్యోగ మేళా

రణస్థలం: విశాఖపట్నం, హైదరాబాద్‌లకు చెందిన అరబిందో ఫార్మా, హెటోరో డ్రగ్స్ కంపెనీలో ఉద్యోగాల భర్తీకి ఈ నెల 5న రణస్థలంలోని శాంతినికేతన్ డిగ్రీ కళాశాల ఆవరణలో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు కళాశాల కరస్పాండెంట్ జి.చంద్రశేఖర్ శుక్రవారం తెలిపారు. విశాఖ స్కిల్‌సెంటర్‌లో 45 రోజుల పాటు ఫార్మాలో ఉచిత శిక్షణ ఇచ్చి ఎంపికైన అభ్యర్థులకు ఉద్యోగం కల్పిస్తారని పేర్కొన్నారు. బీఎస్సీ కెమిస్ట్రీ(పాస్/ఫెయిల్), ఇంటర్మీడియెట్, ఐటీఐ (ఫిట్టర్/ఎలక్ట్రీషియన్), డిప్లమో చదివిన 27 ఏళ్లలోపు పురుష అభ్యర్థులు అర్హులని తెలిపారు. వివరాలకు 83281 91643, 86880 80562 నంబర్లను సంప్రదించాలని కోరారు.

విశ్లేషణాత్మక విద్య అందించాలి

- కాలేజియేట్ ఎడ్యుకేషన్ కమిషనర్ డాక్టర్ పోలా భాస్కర్
- శ్రీకాకుళం ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ముగిసిన జాతీయ సదస్సు



డాక్టర్ పోలా భాస్కర్‌ను సత్కరిస్తున్న ప్రిన్సిపాల్ శ్రీరాములు, పూర్వపు వీసీ లజపతిరాయ్

శ్రీకాకుళం న్యూకాలనీ: విద్యార్థులకు నైతిక విలువలు, విశ్లేషణాత్మక ప్రమాణాలతో కూడిన విద్యను అందించేందుకు కృషిచేయాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కాలేజియేట్ ఎడ్యుకేషన్(కళాశాల విద్య) కమిషనర్ డాక్టర్ పోలా భాస్కర్ అన్నారు. శ్రీకాకుళం ప్రభుత్వ మహిళా డిగ్రీ (స్వయంప్రతిపత్తి) కళాశాల ఆధ్వర్యంలో ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ సోషల్ సైన్స్ రీసెర్చ్(ఐసీఎస్ఎస్ఆర్), న్యూఢిల్లీ సహకారంతో జాతీయ విద్యా విధానం(నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ)-2020 పేరిట జరుగుతున్న రెండురోజుల జాతీయ సదస్సు శుక్రవారంతో ముగిసింది. ఈ సందర్భంగా భాస్కర్ మాట్లాడుతూ విద్యార్థుల మేధస్సును, విద్యా ప్రమాణాలను విశ్లేషించేలా పరీక్షల నిర్వహణ ఉండాలన్నారు. టీచింగ్, లెర్నింగ్ విధానంలో మరిన్ని మార్పులు, సంస్కరణలు రావాల్సిన అవసరం ఉందన్నారు. 'ఇంటర్న్‌షిప్' విధానంతో ప్రాక్టికల్ నాలెడ్జ్ పెరుగడంతోపాటు ఉపాధి అవకాశాలు పెరుగుతాయన్నారు.

అందరి సహకారం అవసరం..

బీఆర్ఏయూ పూర్వపు వీసీ, గిరిజన యూనివర్సిటీ విజయనగరం స్పెషల్ ఆఫీసర్ ప్రొఫెసర్ హనుమంతు లజపతిరాయ్ మాట్లాడుతూ నూతన విద్యా విధానం అమలుకు కాలేజీల్లో లెక్చరర్లు అంకితభావంతో పనిచేయాలన్నారు. ఎన్ఈపీ నేషనల్ సెమినార్ డైరెక్టర్ అండ్ కన్వీనర్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కణితి శ్రీరాములు మాట్లాడుతూ సదస్సు విజయవంతానికి సహకరించిన కళాశాల లెక్చరర్లు, సిబ్బందిని అభినందించారు. సదస్సు జరిగిన తీరు, ఏర్పాట్లను కో కన్వీనర్ కె.మౌనిక వివరించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ పైడి శంకరనారాయణ, అకడమిక్ కోఆర్డినేటర్ చింతాడ కృష్ణారావు, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ ఎస్.పద్మావతి, రుద్రమరాణి, జ్యోతిలక్ష్మి, నీరజ, కె.సూర్యచంద్ర, ఎస్ఎస్ఎన్ స్వామి, సత్యన్నారాయణ, పి.శివప్రసాద్, ఆర్.ప్రమీల, చక్రవర్తి, డి.పైడితల్లి, పి.శాంతకుమారి, ఎం.ప్రదీప్, వివిధ కళాశాలల అధ్యాపకులు, విద్యార్థులు పరిశోధకులు పాల్గొన్నారు. అంతకుముందు విట్, చెన్నైకు చెందిన కంప్యూటర్ సైన్స్ ప్రొఫెసర్ బీవీఏఎన్ఎస్ఎస్ ప్రభాకరరావు ఐటీసీ టూల్స్ ఫర్ సుస్టైనబుల్ ఎడ్యుకేషన్ అనే అంశంపై ప్రసంగించారు. హైదరాబాద్‌కు చెందిన కాంప్లెక్స్ ఎడ్యు ప్రైవేట్ లిమిటెడ్ కొండాపూర్ కో ఫౌండర్/సీటీవో వై.శ్రీకాంత్ 'హౌ టెక్నాలజీ యాక్ట్స్ యాజ్ ఏ లెవరేజ్ ఇన్ ఇంప్లిమెంటింగ్ ఎన్ఈపీ 2020' అనే అంశంపై ప్రసంగిస్తూ టెక్నాలజీ ఉపయోగించుకునే విధానాన్ని వివరించారు.

సచివాలయాల సందర్శన తప్పనిసరి



నివగాం గ్రామ సచివాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న జెడ్పీ సీఈఓ వెంకట్‌రామన్

కొత్తూరు: గ్రామ సచివాలయాలను ఎంపీడీఓలు, ఈఓపీఆర్‌డీలు, ఏఓలు ఎప్పటికప్పుడు సందర్శించాలని జెడ్పీ సీఈఓ ఆర్.వెంకట్‌రామన్ ఆదేశించారు. కొత్తూరు మండల పరిషత్ కార్యాలయాన్ని శుక్రవారం సందర్శించి రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించేలా చర్యలు తీసుకోవాలన్నారు. హౌస్ హోల్డ్ మ్యాపింగ్ వేగవంతం చేయాలన్నారు. ప్రభుత్వ భవనాల నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. వేసవిలో తాగునీరు సమస్య రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. స్థానిక సంస్థల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలో 776 మంది ఓటర్లు ఉన్నట్లు చెప్పారు. అందులో 38 మంది జెడ్పీటీసీ సభ్యులు, 653 మంది ఎంపీటీసీలు, 74 మంది కౌన్సిలర్లు, 10 మంది ఎమ్మెల్యేలు, ఒక ఎంపీ ఉన్నట్లు వివరించారు. అనంతరం నివగాం సచివాలయాన్ని సందర్శించారు. కార్యక్రమంలో కొత్తూరు ఎంపీడీఓ పావని, ఈఓపీఆర్‌డీ కృష్ణారావు, ఏఓ బి.చిన్నమ్మడు తదితరులు పాల్గొన్నారు

కొనసాగుతున్న క్రీడాపోటీలు



వాలీబాల్ పోరులో తలపడుతున్న క్రీడాకారులు

శ్రీకాకుళం రూరల్: మండల పరిధిలోని ఆచార్య ఎన్‌జీరంగా నైరా వ్యవసాయ కళాశాలలో ఇంటర్మీడియెట్, పాలిటెక్నిక్ గేమ్స్, కల్చరల్ పోటీలు మూడో రోజు శుక్రవారం కూడా కొనసాగాయి. వాలీబాల్ ఫైనల్ పోటీల్లో పాలిటెక్నిక్ అగ్రికల్చర్ ఇంజినీరింగ్ కళాశాల అనకాపల్లి విజేతగా, అగ్రికల్చర్ పాలిటెక్నిక్ కళాశాల కలికిరి రన్నరప్‌గా నిలిచింది. విజేతలకు శనివారం బహుమతులు ప్రదానం చేయనున్నారు.

వేర్వేరు ఘటనల్లో ముగ్గురి మృతి



మన్మధరావు (ఫైల్)



పుణ్యవతి(ఫైల్)



జలుమూరు: ఎర్రమ్మ మృతదేహం వద్ద విలపిస్తున్న కుటుంబ సభ్యులు

జలుమూరు: మండలంలోని శ్రీముఖలింగం ఆలయం సమీపంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి చెందింది. శ్రీముఖలింగం గ్రామానికి చెందిన పంచాది ఎర్రమ్మ(56) తోటివారితో కలిసి ఉన్నత పాఠశాల వైపు పొలం పనులకు బయలుదేరింది. అదే సమయంలో చల్లవానిపేట నుంచి హిరమండలం వెళ్తున్న బొలెరో వాహనం అదుపుతప్పి ఎర్రమ్మను ఢీకొట్టింది. తలకు బలంగా దెబ్బతగలడంతో అక్కడికక్కడే మృతి చెందింది. సైకిల్‌పై వెళ్తున్న ప్రసాద్‌ను కూడా వ్యాన్ ఢీకొట్టడంతో గాయాలయ్యాయి. ప్రసాద్‌ను బుడితి ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రథమ చికిత్స అందించారు. బొలెరో వాహనం గ్రామం శివారున బోల్తాపడింది. డ్రైవరు, క్లీనర్ మద్యం మత్తులో ఉన్నట్లు సమాచారం. గ్రామస్తులు ఇద్దరినీ అదుపులోకి తీసుకొని పోలీసులకు అప్పగించారు. మృతురాలు ఎర్రమ్మకు కుమారుడు శేఖర్, కుమార్తె రోజా ఉన్నారు. కుమారుడి ఫిర్యాదు మేరకు ఎస్ఐ పారినాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

స్కూటీలు ఢీకొని..

బూర్జ : మండలంలోని పెద్దపేట కూడలి వద్ద రెండు స్కూటీలు ఢీకొన్న ఘటనలో వ్యక్తి మృతి చెందాడు. పెద్దపేటకు చెందిన కడగల మన్మధరావు (43) ఉదయాన్నే స్కూటీపై వెళ్తుండగా శ్రీకాకుళం నుంచి పార్వతీపురం వెళ్లేందుకు ఇద్దరు వ్యక్తులు మరో స్కూటీపై అతి వేగంగా వచ్చి బలంగా ఢీకొన్నారు. ఈ ఘటనలో ముగ్గురూ కిందపడిపోయారు. మన్మధరావు తలకు బలమైన గాయాలయ్యాయి. ముగ్గురినీ 108లో పాలకొండ ఏరియా ఆస్పత్రికి తరలించగా అప్పటికే మన్మధరావు మృతి చెందారు. మిగిలిన ఇద్దరూ గాయాలతో బయటపడ్డారు. మన్మధరావుకు భార్య ఇందుమతి, ఇద్దరు కుమారెత్తు దీక్షిత, లహరి ఉన్నారు. ఇందుమతి ఫిర్యాదు మేరకు ఎస్సై బి.అశోక్‌బాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పాలకొండ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

దైవదర్శనానికి వెళ్లి వస్తూ..

టెక్కలి రూరల్: టెక్కలి మండలం రావివలసకు చెందిన నార్ల పుణ్యవతి(49) గురువారం రాత్రి మృతిచెందింది. ఈమె గత నెల 19న గ్రామస్తులతో కలిసి తిరుమల శ్రీవారి సేవకు వెళ్లారు. ఈ నెల 1న తిరుపతిలో బయలుదేరి స్వగ్రామం వస్తుండగా మార్గమధ్యలో తీవ్రఅస్వస్థతకు గురైంది. ఇక్కడికి తీసుకొచ్చాక శ్రీకాకుళం రిమ్స్‌లో చేర్పించారు. అప్పటి నుంచి చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతిచెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. పుణ్యవతి భర్త కామేశ్వరరావు కొన్నేళ్ల కిందట మృతిచెందారు. వీరికి ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. మృతదేహానికి శుక్రవారం రావివలసలో అంత్యక్రియలు నిర్వహించారు.

విద్యుత్ ఉద్యోగుల సంఘ రీజనల్ ప్రెసిడెంట్‌గా శ్రీనివాసరాజు



కొత్త కార్యవర్గాన్ని అభినందిస్తున్న ఎస్ఈ దైవప్రసాద్

అరసవల్లి: వైఎస్సార్ విద్యుత్ ఉద్యోగుల సంఘ రీజనల్ ప్రెసిడెంట్‌గా వైశ్యరాజు శ్రీనివాసరాజు (సీనియర్ అసిస్టెంట్) నియమితులయ్యారు. ఈ నెల 1న నిర్వహించిన యూనియన్ సర్వసభ్య సమావేశంలో డిస్కం అధ్యక్షుడు ఎ.జి.సత్యనారాయణ, డిస్కం సెక్రటరీ పి.కె.వి.ఎం.లక్ష్మీరావుల ఆధ్వర్యంలో రీజనల్ ప్రెసిడెంట్‌గా శ్రీనివాసరాజు, రీజనల్ సెక్రటరీగా ఆర్.శ్రీనివాస్ (జేఏఓ), వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎ.జోగారావు (జూనియర్ అసిస్టెంట్), ఆర్గనైజింగ్ సెక్రటరీగా కె.సింహాచలం (లైన్‌మేన్), రీజనల్ ట్రెజరర్‌గా ఎల్.నవీన్‌కుమార్ (జూనియర్ అసిస్టెంట్) తదితరులు నియమితులయ్యారు. కొత్త కార్యవర్గ సభ్యులు శుక్రవారం విద్యుత్ శాఖ ఎస్ఈ ఎల్.దైవప్రసాద్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా ఎస్ఈ మాట్లాడుతూ నిజాయితీగా విద్యుత్ ఉద్యోగుల సంక్షేమం కోసం వైఎస్సార్ విద్యుత్ ఉద్యోగుల సంఘం కృషి చేస్తుండటం అభినందనీయమని కొనియాడారు.

గడ్డికుప్పలు దగ్ధం



కాలిపోతున్న గడ్డికుప్పలు

టెక్కలి రూరల్: స్థానిక మండపొలం కాలనీలో శుక్రవారం సాయంత్రం జరిగిన అగ్ని ప్రమాదంలో అదే వీధిలోని కోనారి రామారావుకు చెందిన సుమారు ఐదు ఎకరాల గడ్డికుప్పలు దగ్ధమయ్యాయి. ఒక్కసారిగా మంటలు ఎగసిపడటంతో స్థానికులు ఆందోళనకు గురై అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. స్టేషన్ ఫైర్ అధికారి మల్లేశ్వరరావు, సిబ్బంది సకాలంలో చేరుకుని మంటలను అదుపు చేశారు. విద్యుత్ వైర్లు ఒకదానికొకటి తగలడం వల్ల ఈ ప్రమాదం జరిగి ఉంటుందని స్థానికులు భావిస్తున్నారు.

అలరించిన స్వరలయ విన్యాసం



కచేరీ చేస్తున్న పద్మశ్రీ ఎల్లా వెంకటేశ్వరరావు బృందం

కవిటి: మండలంలోని చండిపుట్టుగలో శుక్రవారం సంగీత కళానిధి పద్మశ్రీ ఏ.కన్యాకుమారి వయోలిన్, పద్మశ్రీ ఎల్లా వెంకటేశ్వరరావు మృదంగంతో నిర్వహించిన స్వరలయ విన్యాస మాధురి ఆద్యంతం సంగీత ప్రియులను ఆనందసాగరంలో ఓలలాడించింది. వైకం గోపాలకృష్ణన్ తబలాతో, నిషాంత్‌చంద్ర వయోలిన్‌తో వాయిద్యసహకారం అందించారు. అన్నమాచార్య కీర్తనలు, త్యాగరాజకృతులు సంగీత ప్రియుల్ని అలరించాయి. చండిపుట్టుగకు చెందిన బొర్ర సురేష్ కార్యక్రమానికి ఆర్థిక సహకారం అందించారు.

ఆకృతితో అవగాహన



టెక్కలి సమీకృత బాలికల వసతి గృహంలో విద్యార్థినుల ప్రదర్శన

టెక్కలి: లైంగిక వేధింపులపై ఆడ పిల్లలు తక్షణమే ఫిర్యాదు చేయాలని కె.కొత్తూరు పీహెచ్‌సీ వైద్యురాలు ఇంద్రజ సూచించారు. వెల్లడించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆడ పిల్లలను రక్షించు-ఆడపిల్లను చదివించు కార్యక్రమాన్ని శుక్రవారం టెక్కలి సమీకృత బాలికల వసతి గృహంలో నిర్వహించారు. ఈ సందర్భంగా 'గర్ల్' ఆకారంలో వసతి గృహ విద్యార్థినుల ప్రదర్శన ఆకట్టుకుంది.

పాఠశాలను మూసివేస్తే క్రిమినల్ చర్యలు



విచారణ జరుపుతున్న రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు సీతారాం

ఆమదాలవలస రూరల్: విద్యార్థుల చదువుతో చెలగాటమాడుతూ విద్యా సంవత్సరం చివరిలో ప్రైవేట్ స్కూల్‌ను మూసివేస్తే యాజమాన్యంపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు డాక్టర్ గొండు సీతారాం హెచ్చరించారు. ఆమదాలవలస మండలం అక్కివరం పంచాయతీ కొత్తరోడ్ జంక్షన్‌లో వెలాసిటీ ఇంటర్నేషనల్ ప్రైవేట్ స్కూల్ నిర్వహణపై తల్లిదండ్రుల నుంచి ఫిర్యాదులు రావడంతో శుక్రవారం విచారణ చేపట్టారు. తరగతుల నిర్వహణ జరగకపోవడంతో విద్యాశాఖాధికారులు, సచివాలయం మహిళా సంరక్షణ, సంక్షేమ కార్యదర్శులు తీసుకున్న చర్యలపై ఆరా తీశారు. మూడు నెలలుగా ఫిర్యాదులు వస్తున్నా ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. విద్యాసంవత్సరం మరో రెండు నెలల్లో ముగియనుండటంతో అర్థాంతరంగా స్కూల్ మూసివేస్తే కలెక్టర్, ఎస్పీలకు ఆదేశాలు ఇచ్చి యాజమాన్యంపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని కమిషన్ సభ్యులు తెలిపారు. విద్యా సంవత్సరం ముగిసే వరకు తరగతులు నిర్వహించేలా చర్యలు చేపట్టాలని డీఈఓకు ఆదేశాలు జారీ చేస్తామన్నారు. విద్యాశాఖాధికారులు, సచివాలయ సిబ్బంది నిత్యం సందర్శిస్తూ పర్యవేక్షణ చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓ డి.రామారావు, తోటాడ సర్పంచ్ మెట్ట శారద, జిల్లా బాలల సంరక్షణ అధికారి కె.వి.రమణ, బాలల సంఘాల నాయకులు కె.శ్రీనివాస్, మొదలవలస వాసుదేవ కుమార్, బి.రమేష్ పాల్గొన్నారు.